# మాటలెరుగని మమత

ఆరోజు శివరాత్రి. పర్వదినం. విశాలక్షమ్మగారు ప్రాతఃకాలానే స్నానాదికాలు ముగించి అప్పుడే కోవెలకువెళ్ళి తిరిగికూడా వచ్చింది. వచ్చీరావటంతోనే "కమలా" అని కేక వేసింది. "ఎందుకే అమ్మా" అంటూ అప్పుడే సింగారింపు పూర్తయి 'కూటికురా' పౌడర్ మందంగా పూసుకుని అందంగా తుకుచుకుంటూ విశాలక్షమ్మగారి పుత్రిక వచ్చింది.

"చూశావా, నిన్ను గుడికిరమ్మంటే నాతోకూడా వచ్చావుగాదు. ఇవాళ అమ్మవారిని రవ్వలకిరీటంతో అలంకరించారు ఎంతబాగుందనుకున్నావు" అంది. "అయితే నేను ఇప్పుడు పోయివస్తాలేవే" అని కూతురు అనేటప్పటికి "ఒంటరిగా ఎట్లా పోతావే! తోడిచ్చి పంపుదామంటే ఆ రాము కోటాయి అయినా ఇంకావచ్చాడు కాదు" అని తను మేజస్ట్రీటుగారి భార్య అనే హుందా కనపరిచింది

"సర్లేవే. నీదొకగోడవ. గుడికిపోతూ కూడా కోటాయివెంట దేనికే. నేనేం పోలేనా! మారుపడతానా?" అని తన ముస్తాబును పూర్తిచేసుకొని శివాలయానికి బయలుదేరింది ఒంటరిగానే. దేవాలయానికి పోయేవాళ్ళు ఏ కొబ్బరికాయో, పండో ఫలమో తీసుకొనిపోవాలా. అదేంలేదు. ఆ అమ్మాయి కూటికూరా పౌడర్ అద్దిన రుమాలామాత్రమే చేత్తోతీసుకుపోయింది.

ఆ అమ్మాయిని వెనుకగానీ ముందుగానీ ఎవరూ అనుసరించి పోవటంలేదు. కానీ అమ్మాయిముందు ఒకముప్పదిమంది, వెనుక ఒకముప్పదిమందీ ఎవరి దోవనవాళ్లు పోతున్నారు. ముందుపోతున్న ముప్పదిమందికీ వెనుక కళ్ళు లేవుగాబట్టి ఈ అమ్మాయిని చూడలేదు కానీ వెనుకనడుస్తున్న ముప్పదిమందికళ్ళూ ఆ అమ్మాయిమీద పడ్డాయి పడక ఏంచేస్తాయి, ఆ అమ్మాయి అట్లాంటి డ్రస్ వేసింది.

ఆ పిలకట్టిన క్రీంకలర్ జాకెట్ లంగా పైన రోజ్ కలర్ డ్ క్రేప్ సిల్కు చీర ఆమె నిమ్మపండు శరీరచ్ఛాయకు ఎంతో శోభ తెచ్చింది. ఆచీరకి మాచ్ అయే బౌజ్, దాని మీద ఎంబ్రాసయిన వెల్ వెట్ సీతాకోక చిలుకలు, రెండుజడలనుంచీ రెండురిబ్బన్లూ [illegible] ఘుమఘుమలూ, మీదు మిక్కిలి ఆ అమ్మాయి యవ్వనం అందరినీ ఆకర్షించేటట్లు చేసినవి

మరీ చోద్యం గానీ, లేకపోతే దేవాలయానికి పోతూ ఈ వేషం దేనికి చెప్పండి మీరే ఏమయితేం అది ఆ అమ్మాయి అంతరంగిక విషయం అని పూరుకోకుండా "అమ్మాయీ ఇది దేవాలయానికి పోయే వేషంకాదు. ఏ బీచికో, పెళ్ళయింతరువాత మొగడితో షికారుకో పోయే వేషం అని వాళ్ళ పెద్దవాళ్లు చెప్పి ఉండాల్సింది" కానీ విశాలక్షమ్మగారు అట్లా చెప్పేరకం కాదు తాము మేజస్ట్రీటుగారి తాలూకు మనుష్యులు గాబట్టి అందరికంటే 'గొప్పవారిమనే ఆధిక్యం కనపరచాలనే మనిషి ఆమె. అసలు ఇక్కడే వచ్చింది పెద్ద చిక్కంతా.

గొళ్ళమూడి గోపాలకృష్ణమూర్తి

ఆ అమ్మాయి పోయిపోయి దేవాలయావరణలో ప్రవేశించింది పెద్ద ధీమాతో. అక్కడయినా నలుగురూ నడిచే విధంగా నడవక వ్యతిరేకంగా ప్రవర్తించింది.

నలుగురితోపాటు ముఖద్వారం నుంచి దేవాలయ ప్రవేశానికి ఇష్టపడక స్పెషల్ గా అర్చకులు, ట్రస్టీలు తిరిగే ద్వారంగుండా ప్రవేశిద్దామనుకుంది, అనుకుంటే అనుకుంది ఈ స్పెషల్ దర్శనం అంటూ శివరాత్రినాడు పావలా వసూలుచేసి మరీ పంపిస్తున్నారు. కానీ మేజస్ట్రీటుగారి పుత్రిక టిక్కెట్టు కొనకుండానే ప్రవేశించ దలచింది.

ఖర్మకొద్దీ అప్పుడు ఆ ద్వారం దగ్గర స్పెషల్ డ్యూటీగా ఒక నవయౌవన సుందరాకారుడు ద్వారపాలకుడుగా వేంచేసి ఉన్నాడు. పాంట్సు నలుగు పిండిలాగా రాసుకొని

పూర్వకాలంలో అయితే ద్వారపాలకులకు జీతభత్యాలివ్వాల్సి వస్తుందని, రెండు రాతి బొమ్మలను ద్వారానికిరువైపులా నిలబెట్టేవారు. దేవాలయాలు ఎండోమెంటువారి పరమయిన తరువాత నోరూ వాయి లేని దేముడిని రాతిబొమ్మగా ఉంచేసి, ద్వారపాలకులకు ప్రాణప్రతిష్ఠ చేశారు.

ఈ అమ్మాయిని చూసీ చూడగానే ట్వీడ్ పాంటు వేసుకున్న ద్వారపాలకుడికి ఒక ఆలోచన కలిగింది

ఈ చిలుక ముక్కులాంటి అమ్మాయి జాకెట్టుమీద సీతాకోక చిలుకలను కుట్టించింది. ఆమె కంఠంలోనుంచి చిలుక పలుకులే వస్తవో, కోకిలగానమే పెల్లుబుకుతుందో అని అతనికి సందేహం కలిగింది. సందేహం కలిగితే కలిగింది. ఊరుకోకుండా సందేహ నివృత్తికోసం ఆ అమ్మాయిని మాట్లాడిద్దామనుకున్న వాడయి "ఓ! నవయౌవన సుకుమార కోమల సుందరాంగీ! స్పెషల్ దర్శనానికి టిక్కెట్టు కొన్నావా? టిక్కెట్టు లేనిదే ఈశ్వరుడిని కూడా రానీయొద్దని పార్వతీదేవి ఆజ్ఞ" అని అపర గణపతిలాగా అన్నాడు.

ఇతని సంబోధనలకు ఆ అమ్మాయికి కోపం వచ్చింది. అయినా ఉలకలేదు పలకలేదు. కానీ ముఖం ముటముటలాడించింది.

ముఖకళవళికలద్వారా అమ్మాయి మనసెరింగి ఆ ట్వీడ్ పాంటులోని నలుగుపిండి ద్వారపాలకుడు "టిక్కెట్టు లేనిదే పోనివ్వను టిక్కెట్టుకొను" అని సవ్యంగానే అన్నాడు

అప్పటికీ ఆ అమ్మాయి దగ్గరనుంచి ఏ సమాధానం రాకపోయే టప్పటికి ఆ సరికొత్త ద్వారపాలకుడికి ఓ అనుమానం వేసి "బహుశా ఇవాళ టిక్కెట్టు కొనాలని తెలిసి ఉండదు. అందుకని డబ్బులు తేలేదల్లే ఉంది. ఏదో ఒక మాటమాట్లాడి తేనేగాని పోనివ్వను" అని తన ఆజ్ఞకు ఒకచిన్న ఎమెండ్ మెంటు పెట్టాడు.

ఈ వేళాకోళానికి ఆ అమ్మాయి ముక్కుమీద అంతవరకూ తాండవం చేస్తున్న కోపం కాస్తా బడీచప్పుడుకాకుండా పుటుక్కున కిందకు జారింది. కోపంవస్తే పోట్లాడవచ్చు అదేంలేకుండా సడెన్ గా రైట్ ఎబౌట్ టరన్ కొట్టింది

ఈ సంగతి గ్రహించిన బుష్ కోటు లోని ద్వారపాలకుడికి మతిపోయినట్టయి మాట జారాడు అప్రయత్నంగా. ఏమన్నాడో ఏమోగాని ఆ మాటలు ఆ అమ్మాయి ఒక్కదానికే వినిపించినవి.

ఈ వ్యవహారం ఇంతటితో ఆగవచ్చు.

# ★ మాటలెరుగని మమత ★

ఆగలేదు. ఇట్లా జరిగిందని ఆ అమ్మాయి వాళ్ళ అమ్మకు చెప్పింది. నేనేంతక్కువ తిన్నానా అని వాళ్ళ నాన్నకూ చెప్పాడు ద్వారపాలకుడు.

ఎట్లా గయినా మగ పిల్లవాడి తండ్రికదా! సంతోషించి మంద స్మిత వదనారవిందుడయి మామూలు వ్యవహారమే గదా అని ఆ సంగతి వెంటనే మరిచిపోదామని, వేరే ప్రయత్నం చేయకుండానే మరిచిపోయాడు.

ఇక పోతే ఆడపిల్ల సంగతి. చెప్పక చెప్పక తల్లికి చెప్పింది. "ఆ! నిన్ను గుళ్ళోకిపోనీయక పోగా ఇంత మాట అన్నాడా" అని గుడ్లు ఉరిమేటప్పటికి ఎదురుగా ఉన్న మేజస్ట్రేటు గారు తన హోదా గుడా మరిచిపోయి గడగడ లాడాడు. "చూశారా! చూశారా! మన అమ్మాయిని గుళ్ళోకి పోనీయకుండా పైగా 'మూగిపిల వా! నీకు మాటలు రావా;' అని ఆ వెధవెవడో అన్నాట్టండి. నా పిల్లనే నానా మాటలంటే ఇంకా మీ మేజస్ట్రేటు గిరెందుకు, మీ రావు బహద్దర్ బిరుదెందుకు." అని కస్సుబుస్సుమనేటప్పటికి మేజస్ట్రేటు గారికిగూడా ఎక్కడలేని కోపం వచ్చింది. "నీకు కేనికి నీ వూరుకో దుష్టశిక్షణ, శిష్టరక్షణా చేసేభారం నాది" అని భార్యను శాంతపరిచేటప్పటికి తల ప్రాణం తోకకి వచ్చింది.

"జౌరా! ఎంత చెడుకాలం వచ్చింది," అని అనుకున్నాడు మేజస్ట్రేటుగారు, ఈ వ్యవహారం అంతు ఎట్లా తేల్చాలా అని ఆలోచించుకుంటూ. ఏమీతోచక దిక్కులు చూచుకుంటుంటే ఎదురుగా గాంధీమహాత్ముని పటం నవ్వుతూ కనిపించింది.

ఇంకేం మహాత్ముని వదనారవిందం తిలకించేటప్పటికి తానేం చేయాలో తెలిసిపోయిందిఇట్టే దానిని వెంటనే అమలుపరిచేశాడు. "మహాత్మా! నీ" సహాయ నిరాకరణం, "సత్యాగ్రహం" ఎటువంటి అస్త్రాలయ్యా అని అనుకున్నాడు మనస్సులోనే.

పర్వదినమయిన శివరాత్రినాడు ఎంతో మంది భక్తులు దేవాలయానికి వచ్చిపోతున్నారు. కానీ రోజూ తప్పనిసరిగా దేవాలయానికి వేంచేసే మేజస్ట్రేటుగారు ఎందుకు రాలేదా అని ధర్మకర్త స్వరూపంలో ఉన్న ప్లీడరుగారు అనుకున్నవాడయి ఏం అపచారం జరిగిందో కనుక్కోవాలని బయలు దేరాడు. బయలుదేరొద్దూ, ఈయన ప్లీడరాయె ఆయన మేజస్ట్రేటుగారాయె.

వెళ్ళి వెళ్ళి తన అంబుల పొదిలోంచి తీసి ఒకేఒక్క బాణం, అదే నమస్కార బాణం, వదిలాడు గురిచూసి అది వెళ్ళి సూటిగా మేజస్ట్రేటుగారి రెండు కళ్ళు పొడిచింది. వెంటనే మేజస్ట్రేటు గారు మూతి అదోకలా పెట్టి ముఖం కందగడ్డలాగా చేశారు.

పెళ్ళాంమీద అలిగాడేమో, రవ్వల నెక్లెసు చేయించమందని, అనుకొని "దైవ దర్శనానికి దయచేశారు గారు పరవశిపూట" అని అడగదలచుకున్నది సూటిగా అడిగేసి, తనపని ముగించుకొని కూర్చున్నాడు ధర్మకర్త స్వరూపుడయిన అడ్వకేటు.

ఈ ప్రశ్న ఎప్పుడు అడుగుతాడా అని కాచుకు కూర్చున్న మేజిస్ట్రేటు గారు వెంటనే తాను అనుకున్నదంతా నెమరువేసుకొని "దీనికికూడా టిక్కెట్టు పెట్టారేమో అని రాలేదు" అని అనేసి ఊరుకున్నాడు.

దీనికి ధర్మకర్తగారు ఏమనాలో తోచక "మీ హాస్యం నాకేం బోధపడలేదు," అని అనేసి నిశ్చింతగా ఊరుకున్నాడు మిగిలినదంతా ఆయన వంతే అన్నట్లుగా.

"మా అమ్మాయి కమల రాక రాక గుడికి వస్తే నానామాటలుఅని పంపారుట. ఇదేనా మీ మర్యాద." అని మేజస్ట్రేటుగారు తన హోదా ఒలకబోశారు.

ఎదురుగావున్న లాయరుగారు దీనికి "అబ్జక్షన్ మైలార్డు" అంటూ "అయ్యా! మీ అమ్మాయి వెంబడి ప్యూన్ని ఎవరినయినా పంపి ఉండాల్సింది. ఆ అమ్మాయి ఫలానావారి పిల్ల అని తెలిసి ఉండనందువ అట్లా జరిగి ఉంటుంది. రూల్సు ప్రకారమే జరిగిన దానికి క్షమించి తీర్థ ప్రసాదాలు సేవించటానికి, దేవాలయానికి దయచేయండి" అని అన్నారు.

దీనికి మేజస్ట్రేటుగారు "అయినా దేవాలయంలో వృద్ధుల్ని కాక కుర్రకుంకలని ఎందుకు నియమించారు" అని కౌంటర్ ఆర్గ్యుమెంటు వేశారు,

"ఏదో అయిన దానికి మన్నించమన్నాగా. ఇకనయినా దయచేయండి" అని ఎంత బతిమాలినా ససేమిరా ఆయనవింటేనా! ఈయన రానంటే ఆయనేం చేస్తాడు. "రోజూ ప్రసాదం పేర ఆయన తీసుకుపోయే సవాశేరు కలకండయినా మిగిలిం" దనుకుంటూ తిరిగి వెళ్ళిపోయాడు ధర్మకర్త గారు.

గుళ్ళో కలకండ అయితే మిగిలింది గాని మనస్సులో శాంతి హరించింది హారతి కర్పూరంలా. రేపు రథోత్సవం. దానికి మేజస్ట్రేటుగారి అనుమతి కావాలి. కానీ ఇవాళ సత్యాగ్రహం చేసినవాడు రేపు సహాయనిరాకరణ చేయకపోడు అనుకొని ఎడ్వకేటు స్వరూపుడయిన ధర్మకర్త గారు లాపుస్తకాలు తిరగేయకుండానే ఒక చిన్న ప్లాను వేశారు.

* * *

రథోత్సవం ఇంకా అయిదు నిమిషాలలో మొదలు పెట్టబోతున్నారు. ఊరేగుదామని దేముడికి సరదా ఉందో లేదో గాని చుట్టూ ఉన్న ఉత్సవిగ్రహాలు నానా హంగామా చేస్తున్నాయి. దేముడి పెళ్ళికి అందరూ పెద్దలేగా మరి.

"అరే! నా ఆజ్ఞ లేకుండా రథోత్సవం ఎట్లా జరుగుతుంది. వీల్లేదు. ఏమనుకున్నాడో నా తడాఖా" అనుకుంటూ రోడ్డు మీదనే గుండీలు సర్దుకుంటూ నానా హడావిడిగా జనాన్ని వెంటబెట్టుకుని స్ట్రీటు లోనికి బయలుదేరారు మేజస్ట్రేటు గారు.

రథం ముందు కుంభం పోసి ఉంది. అక్కడకు పోయేటప్పటికి తనపని కుంభంలోని అంభం అయింది. అక్కడికి ఎంత దర్పంతో వెళ్ళాడో అంత కళావిహీనుడయి నిశ్చేష్టుడయి పోయాడు.

దేముడెదురొచ్చినా భయపడే వాడిని కాదంటూ బయలుదేరిన మేజస్ట్రేటు గారు గడగడ వణకటం మొదలుపెట్టారు. ఎదురుగా జిల్లాకలెక్టరు గారు కనపడేటప్పటికి తన నరాలన్నీ ఒక్కమారే సడలినాయి. మామూలుగా కర్రపెత్తనం చెలాయించే హోదా అంతా ఎక్కడికో ఎగిరిపోగా పెద్ద నేరస్థుడిలాగా శ్రీవారి ఎదుట నిలబడ్డారు సబ్ మేజ

(55 వ పేజీ చూడండి)



# ★ మాటలెరుగని మమత ★

(8 వ పేజీ తరువాయి)

స్ట్రేటు గారు. ఏం చేయటానికితోచక ఒక్క నమస్కారం చేశాడు. అదేగా ప్రస్తుతం తన దగ్గర ఉన్న అస్త్రం.

"ఏమయ్యా! లోకల్ సబ్ మేజస్ట్రేటు వేమిటి? స్ట్రీటులో ఉండి ఎన్నో జాగర్తలు చేయవలసిన వాడివి, ఇప్పుడు రావటం ఏమిటి. రావేమో ననుకున్నాం. వచ్చేవేం? ఉత్సవం ఆపు చేయటానికి వచ్చినట్లున్నావు కదూ" అని అనవలసిన మాటలన్నీ అనేశారు శ్రీ వారు.

"అది కాదండి..." అని అన్నాడే కాని తక్కినమాటలు నోరు పెగిలిరాలేదు. ఏమని చెప్పేటట్లు?

"నాకు తెలుసులేవోయి నీవు చెప్పే సంజాయిషి. ఏమని చెప్పుకోవాలో నీకే నోరు పెగిలిరాలేదు. నీలాంటి స్వార్థపరుడికి డీశిలో మారు మూలలు గాని పనికిరావు నల్నాడు లాంటి ప్రదేశాలకు ట్రాన్స్ఫర్ చేస్తాను అని శలవిచ్చారు.

ఈ మాటతో మేజస్ట్రేటుగారికి స్ట్రీటు స్ట్రీటు అంతా గిరగిరా తిరగటం మొదలు పెట్టింది. ముఖం ఆముదంతాగిన వాడిలాగా అయిపోయి నోట్లో మాటలు నోట్లోనే నిలిచిపోయినవి.

అందరూ ఉత్సవానికి ఇంత ఖుషీగా ఉంటే పాపం ఈ మేజిస్ట్రేటు మీద ఈ ముసుగు ఎందుకేయటం తీద్దాం అనుకొని నల్/ మీ ట్రన్స్ఫరు మాఫీ చేస్తాను. కానీ మీరు నేచెప్పినట్లు చేయండి" అన్నారు జిల్లా కలెక్టరయిన నల్లదొరగారు.

ఈమాటకి మేజస్ట్రేటుగారి ముఖం వికసించి నోట్లోనే ఆగిపోయిన మాటలు ఊడి వడినవి "చిత్తం" అనే శబ్దంతో.

"మీ అమ్మాయిని ద్వారపాలకుడికి ఇచ్చివివాహం చేయండి" అన్నారు కలెక్టరుగారు.

ఈ మాటలు అనేటప్పటికి కలెక్టరుగారు తీసేశారనుకున్న ముసుగు ఆయనకు తెలియకుండా మేజిస్ట్రేటు గారి మీద పడి స్ట్రీటంతా కనిపించకుండా చేసినది.

ఈకండిషనుకు ఒప్పుకునే దానికంటె ట్ర్యాన్స్ఫర్ నయమనిపించింది. ఈసంగతి కనిపెట్టిన కలెక్టరుగారు "అయ్యా! దీనికి మీరు యస్ అనండి. అంతా నాకు తెలుసు, నేనేం అంత అవ్యక్తంగా మాట్లాడటం లేదు. ద్వారాపాలకుడని సంశయిస్తున్నారేమో. మీ రెంత ప్రయాసపడినా ఇంత కన్నా మంచిసంబంధం తేలేరు." శాస్త్ర ఉపశాంతి కలిగించారు.

తరువాత ఏముంది యస్ అనటం, వివాహం జరగటం అయిపోయింది.

ఈ శాంకోపాంజా లాంటి కలెక్టరుగారు కుదిర్చిన వివాహంవలన ధర్మకర్త స్వరూపుడయిన ప్లీడరుగారూ మేజిస్ట్రేటుగారూ స్ట్రీటులో ఊరేగి వియ్యంకులయి కూర్చున్నారు.

ఈ పెళ్ళికి అందరూ సంతోషించారు. కానీ ఈ పెళ్ళికొడుక్కి తనకూతుర్ని ఇద్దామనుకున్న నల్లమామయ్యకు పెళ్ళి నిందులపయిందలా. ఈ పెళ్ళి ఇట్లా ఎందుకు ఎట్లా జరిగిందా అని డిటెక్టివ్ చేశాడు. ఎంతకూ తేలకపోయేటప్పటికి వెళ్ళి పెళ్ళికొడుకూ, పెళ్ళికూతుర్ననే అడిగేశాడు.

"ఏమిరా అయి ఉండవలసిన అల్లుడా! ఈ పెళ్ళి జరగటానికి కారణం ఎట్లాంటిది? దానికి బాధ్యులెవరు?" అని అడిగాడు నల్లమామయ్య.

"దీనికంతటికీ ఒక సిగరెట్ ముక్క కారణం మామయ్యా! సిగరెట్ తెమ్మని సుళ్లో ద్వారం దగ్గర ఉంటే బంట్రోతుని పంపించి, నేను వాడు ఉండేచోట నుంచోటంవలన ఇంత ప్రమాదం నీకొచ్చిపడింది." అని ఈ నల్లమామయ్య నల్లకూతురు తనకు తప్పిందిగా అనుకుంటూ సంతోషంగా చెప్పాడు.

"నీవు చెప్పేదేమిటమ్మా?" అని ఆ అమ్మాయిని అడిగితే ఏంమాట్లాడలేదు.

"ఏంరా పెళ్ళికొడుకూ నీ భార్య మాట్లాడ దేంరా?" అని పెళ్ళికొడుకుని మళ్ళీ అడిగాడు నల్లమామయ్య.

"అదా ఇంకా నీకు తెలియదా. ఆనాడు ఒకేఒక మాట గనక మాట్లాడినట్లయితే ఇంత గందరగోళం జరిగేదిగాదు. మా ఆవిడది మాట లెరుగని మమతలే మామయ్యా! అన్నాడు ప్రెంచికట్ పెళ్ళికొడుకు. ఇంతలోకి ఈ నల్లమామయ్య నల్లకూతురిని తన మనుమడికి చేసుకోవటం ఇష్టంలేని బామ్మగారువచ్చి "ఇదుగో నేను చెపుతావినూ. నీ నల్లపిల్లను మా మనుమడికి చేయటం దేముడికి గూడా ఇష్టంలేదు. పెళ్ళి అనేది బ్రహ్మరాసిపెట్టే అవుతుందిగాని, నీవూ నేనూ అనుకుంటే అవుతుందా!" అంది. అందరూ పకపకా నవ్వారు. దీనితో నల్లమామయ్య ముఖం నల్లబడింది. కానీ ఆ నలుపు నలుపులో కలిసిపోయి ఎవరికీ కనిపించలా. ★

త్వరలో....బిమల్ రాయ్ నిర్మించిన



పరివార్

(హిందీ)

ఉషాకిరణ్, దుర్గాఖోటే,

జైరాజ్, ఆగా

గాత్ర ఆర్టిస్టు : కిషోర్ కుమార్.

మ్యూజిక్ : సలిల్ చౌదరి.

డైరెక్షన్ : అసిత్ సేన్.

చక్కని హాస్యంతో నిండిన చిత్రం.

ఈ చిత్రంలోని పాటలు ప్రతి బుధవారం రాత్రి 9 గం॥ నుండి 9-15 గం॥ వరకు, ఆదివారం పగలు 12 గం॥ నుండి 12-45 గం॥ వరకు సిలోన్ రేడియోలో వినండి

—నవయుగ